

అనుకోకుండా తారసపడ్డ తమ ప్రియతమ నేత, మాజీ మంత్రి కేటీఆర్‌ను చూసి నర్సింగ్ విద్యార్థులు సంబుర పడ్డారు. కేటీఆర్‌తో సెల్ఫీలు తీసుకొని మురిసిపోయారు. నందినగర్‌లోని కేటీఆర్ నివాసం అందుకు వేదికైంది.

# పెట్టుబడులపై రేవంత్ ఫేక్ ప్రచారం!

- సీఎం విదేశీ పర్యటనలతో ఒరిగిందేమీలేదు
- మోసం చేయడమే కాంగ్రెస్ పాలకుల నైజం
- కేసీఆర్ ఆనవాళ్లు చెరిపివేసేందుకు కుట్రలు
- కట్టుకథల గుట్టువిప్పిన ఎమ్మెల్యే వివేకానంద



హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణకు వేలకోట్ల పెట్టుబడులు వస్తున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నదంతా తప్పుడు ప్రచారమని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శించారు. గతంలో అమెరికా, దావోస్ పర్యటనల సందర్భంగా పెట్టుబడులు వస్తున్నాయంటూ ఊదరగొట్టిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు సింగపూర్‌కు నాటకానికి తెరలేపారని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో ఒప్పందం చేసుకున్న కంపెనీలతోనే రేవంత్ మళ్లీ ఒప్పందాలు చేసుకోవడం విడ్డూరమని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రిగా గుర్తింపు కోసమే రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనలకు వెళ్తున్నారని విమర్శించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వివేకానంద విలేకరులతో మాట్లాడారు. గతంలో దావోస్‌కు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి రూ.40, 232 కోట్ల పెట్టుబడులు సాధించామని అబద్ధాలు చెప్పారని విమర్శించారు. వాస్తవానికి తీసుకొచ్చింది కేవలం రూ.862 కోట్లు మాత్రమేనని తెలిపారు. దేవుళ్లపై ఒట్లు పెట్టి రుణమాఫీ చేస్తానంటూ రైతులను నిండా ముంచిన ఘనుడు రేవంత్ అని విరుచుకుపడ్డారు. పెట్టుబడులపైనా ఫేక్ ప్రచారంతో ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేస్తానంటూ రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నంలో తెలంగాణకు తీవ్ర నష్టంచేస్తున్నారని ఆక్షేపించారు.

### కాంగ్రెస్ పనితనం.. పరిశ్రమల పతనం

బీఆర్‌ఎస్ పాలనలో చేపట్టిన ఫార్మాసిటీ, ఫార్ములా-ఈ రేస్, ఎయిర్‌పోర్ట్‌కు మెట్రో పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని వివేకానంద నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించడం, విద్యుత్ సరఫరాలో అంతరాయంతో పెట్టుబడుదారులు భయపడే పరిస్థితులు నెలకొన్నాయని మండిపడ్డారు. కంపెనీలు పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నాయని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో తెలంగాణను క్యాన్సర్ పేషెంట్‌తో పోల్చి అపహాస్యం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎల్ అండ్‌టీ కంపెనీ ప్రతినిధులను బెదిరించారని ఆరోపించారు.

### గోరంత పని.. కొండంత డబ్బా!

గత దావోస్ పర్యటనలో రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయని సీఎం రేవంత్‌రెడ్డి కట్టుకథలు చెప్పారని వివేకానంద విరుచుకుపడ్డారు. ఇందులో రూ.12,400 కోట్లు అదానీ కంపెనీలవేనని, ఇవి రావడం అనుమానమేనని చెప్పారు. గతంలో అదానీ గ్రూప్స్ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకువస్తే ఆ సంస్థ అనైతిక విధానాలు నచ్చకపోవడం బీఆర్‌ఎస్ ప్రభుత్వం తిరస్కరించిందని గుర్తుచేశారు. ప్రస్తుతం ఆ కంపెనీకి రేవంత్ ఎర్రతివాచీ పర్చడం వెనుక ఆంతర్యమేంటని ప్రశ్నించారు. అలాగే రూ.160 కోట్ల విలువైన షెల్ కంపెనీ గోడి రూ.8వేల కోట్ల పెట్టుబడులు పెడుతుందని ప్రభుత్వం చెప్తుంటే నమ్మశక్యంగా లేదని తెలిపారు. జేఎస్‌డబ్ల్యూ ప్రకటించిన రూ.9000 కోట్లు, వెబ్‌వర్క్స్ ప్రకటించిన రూ.5200 కోట్లు బీఆర్‌ఎస్ ప్రభుత్వమే తీసుకొచ్చిందని వివరించారు. గోద్రెజ్ కంపెనీ రూ.1270 కోట్ల పెట్టుబడిలో రూ.300 కోట్లకు నిరుడు ఒప్పందం కుదిరిందని చెప్పారు. అంతేకాకుండా ప్రస్తుతం ప్రభుత్వ పెద్దలు చెప్తున్న రూ.40,232 కోట్ల పెట్టుబడు జాబితాలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడే రూ.14,500 కోట్లకు ఒప్పందాలు జరిగాయని వెల్లడించారు. మొత్తంగా మిగిలేది రూ.5,332 కోట్లు మాత్రమేనని తెలియజేశారు. హైదరాబాద్‌లో కార్యాకలాపాలు నిర్వహిస్తున్న అరగెన్ లైఫ్ సెన్సెస్ రూ.2000 కోట్లు పెట్టుబడి పోనూ నికరంగా మిగిలింది రూ.3,332 కోట్లు మాత్రమేనని చెప్పారు. టాటా గ్రూప్‌కు సంబంధించిన రూ.1500 కోట్ల పెట్టుబడులు ఉన్నాయా? అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇక రూ.1832 కోట్లు మాత్రమే మిగిలిన పెట్టుబడులని వివేకానంద చెప్పారు.

### ఏడాదిలో మీరు చేసిందేముంది?

గతంలోనే రూ.300 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైన గోద్రెజ్ రూ.1270 కోట్లు పెట్టుబడి పెడుతున్నట్టు ప్రకటించిందని వివేకానంద గుర్తుచేశారు. ఇందులో నుంచి రూ. 300 కోట్లు తీసేస్తే రూ.970 కోట్లు మాత్రమేనని వెల్లడించారు. ఇన్వెస్ట్‌మెంట్స్- సర్జికల్ ఇన్‌స్ట్రూమెంట్‌కు చెందిన రూ.231.5 కోట్లు మాత్రమేనని, మిగిలిన రూ.630.5 కోట్ల పెట్టుబడుల వివరాలు తెలియాల్సి ఉన్నదని వివేకానంద చెప్పారు. ఇక బీఎల్ ఆగ్రో, ఇన్నోవేరా, క్యూసెంట్రియో, సిస్ట్రా, ఊబర్, వో9 సొల్యూషన్స్ వంటి కంపెనీలు పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపించినా వివరాలు ప్రకటించలేదని ధ్వజమెత్తారు. మొత్తంగా నిరుడు సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటన వల్ల నికరంగా వచ్చిన పెట్టుబడులు రూ.862 కోట్లు మాత్రమేని పునరుద్ఘాటించారు. కానీ ఫేక్ ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు.

**రేవంత్ సర్కారు పెట్టుబడుల లెక్కలు-వాస్తవాలు**

| కంపెనీ | పెట్టుబడి మొత్తం | రకం | అభిప్రాయం |
|---|---|---|---|
| అదానీ కంపెనీలు | రూ.12,400 కోట్లు | అనుమానాస్పదం | తిరస్కరించిన బీఆర్‌ఎస్ సర్కారు |
| గోడి | రూ.8,000 కోట్లు | అనుమానాస్పదం | చిన్న కంపెనీ సామర్థ్యంపై సందేహం |
| జేఎస్‌డబ్ల్యూ | రూ.9000 కోట్లు | పాతవే | బీఆర్‌ఎస్ హయాంలోనే ఒప్పందం |
| వెబ్ వర్క్స్ | రూ.5200 కోట్లు | పాతవే | బీఆర్‌ఎస్ హయాంలోనే ఒప్పందం |
| గోద్రెజ్ | రూ.1270 కోట్లు | పాక్షికంగా కొత్తవి | బీఆర్‌ఎస్ హయాంలో 300 కోట్లకు ఒప్పందం |
| టాటా గ్రూప్ | రూ.1500 కోట్లు | పాతవే | బీఆర్‌ఎస్ హయాంలోనే చర్చలు మొదలు |
| అరగెన్ లైఫ్ సెన్సెస్ | రూ.2000 కోట్లు | పాతవే/ఇటీవల పెంపు | ఇప్పటికే పరిశ్రమ నిర్వహణ/విస్తరణ |
| సర్జికల్ ఇన్‌స్ట్రూమెంట్ | రూ.231.5 కోటు | కొత్తవి | కొత్త పెట్టుబడులు |
| బీఎల్ ఆగ్రో, ఇతరాలు | రూ.630.5 కోట్లు | కొత్తవి(వివరాలు లేవు) | పూర్తి వివరాలు లేవు |

## నేడు కలెక్టరేట్ల ముట్టడి

- చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ) : తమ సమస్యలు పరిష్కరించాలని చేనేత కార్మికులు కాంగ్రెస్ సర్కారును డిమాండ్ చేస్తున్నారు. ఏడాదిగా ఎక్కడి సమస్యలు అక్కడే ఉండడంతో వారంతా తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వ విధానంపై మండిపడుతున్నారు. చివరి ప్రయత్నంగా రేవంత్‌రెడ్డి సర్కారుపై పోరాటానికి దిగుతున్నారు. ఇప్పటికే రెండు, మూడుసార్లు నిరసనలు, ధర్నాలు నిర్వహించగా.. నేడు రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడికి శ్రీకారంచుట్టారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు నిరసనలు కొనసాగుతూనే ఉంటాయని నేత కార్మిక సంఘం నాయకులు కూరపాటి రమేశ్, శాంతికుమార్ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు.

## రాష్ట్రంలో మళ్లీ పెరిగిన చలి

- మరో రెండ్రోజులు కనిష్ఠ ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో చలి తీవ్రత మళ్లీ పెరిగింది. చలితోపాటు పొగమంచు అధికంగా ఉంటుంది. తెల్లవారుజామున ప్రారంభమై పది గంటల వరకూ ఉంటున్నది. పొగమంచుతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లేవారు మాస్కులు ధరించాల్సి వస్తున్నది. రాష్ట్రంలో అత్యధికంగా 28 డిగ్రీలు, అత్యల్పంగా 11 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రెండ్రోజులపాటు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, పక్కన బీఆర్‌ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, గట్టు రాంచందర్‌రావు, గెల్లు శ్రీనివాస్

# ‘కృష్ణా’ వాటాపై పోరాడిందే కేసీఆర్

### కేంద్రంపై ఒత్తిడితోనే ట్రిబ్యునల్ విచారణకు మార్గం సుగమం

- ఏపీకి నీళ్లు తరలించారనడం అబద్ధం
- ఉత్తమ్‌కు అవగాహన లేకే ఆరోపణలు
- కేసీఆర్ లేఖలను ఉత్తమ్‌కు పంపుతం
- కాంగ్రెస్, బీజేపీది అవగాహనారాహిత్యం
- ఈ విషయంపై బహిరంగ చర్చకు సిద్ధం
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్ సవాల్

హైదరాబాద్, జనవరి 19 (నమస్తేతెలంగాణ): ‘తెలంగాణ ఆవిర్భవించిన తొలిరోజుల్లోనే కేసీఆర్ కృష్ణా జలాల్లో వాటా కోసం పోరాడారు. సెక్షన్-3 ప్రకారం పంపిణీ చేయాలని కేంద్ర మంత్రులకు, ప్రధానికి లేఖలు రాశారు. పట్టించుకోకపోవడంతో సుప్రీంకోర్టులో కేసు వేయించారు.’ అని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ తెలిపారు. అనేకసార్లు కేంద్రంపై ఒత్తిడి తేవడంతోనే వాటా తేల్చాలని బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌ను ఆదేశించిందని గుర్తుచేశారు. కానీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తమ ఘనతగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉన్నదని విమర్శించారు. కృష్ణానీళ్లను కేసీఆర్ ఏపీకి తరలించారని అవగాహనారాహిత్యంతో ఆరోపణలు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ఆదివారం తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, గట్టు రాంచందర్‌రావు, గెల్లు శ్రీనివాస్, చిలకమర్రి నరసింహ, ఇంతియాజ్ అహ్మద్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో వాటా తేల్చాలని అనేక సందర్భాల్లో ఒత్తిడి తెచ్చిన ఫలితంగా 2023 అక్టోబర్‌లో బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌లో విచారణకు మార్గం సుగమమైందని స్పష్టంచేశారు. ఇవేవీ పట్టించుకోని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కేసీఆర్ తెలంగాణకు అన్యాయం చేశారని మాట్లాడడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. బీజేపీ నాయకులు కూడా ఆయనకు వంతపాడడం వింతగా ఉన్నదని ఎద్దేవాచేశారు. నిజంగా ఆ రెండు పార్టీలకు చిత్తశుద్ధి ఉంటే బీఆర్‌ఎస్‌తో బహిరంగ చర్చకు సిద్ధంకావాలని సవాల్ విసిరారు. పదేండ్లలో కేసీఆర్ కేంద్రానికి రాసిన లేఖలను ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పంపుతామని, వాటిని చదువుకొనైనా అవగాహన పెంచుకోవాలని చురకలంటించారు.

# కార్ రేస్ పెట్టలేని దద్దమ్మ రేవంత్

- కేటీఆర్‌ను ఇబ్బంది పెట్టాలనే అవినీతి కేసు
- రాష్ట్రంలో కాంగ్రెస్‌ది వసూళ్ల పాలన
- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ధ్వజం



కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలో జరిగిన బీఆర్‌ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి

తిమ్మాపూర్, జనవరి 19 : తెలంగాణకు ప్రపంచ ఖ్యాతి తీసుకురావాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విదేశాల్లో పర్యటించి సంస్థలను ఒప్పించి ఈ-కార్ రేస్ నిర్వహిస్తే.. వాటిని నిర్వహించరాని దద్దమ్మ సీఎం రేవంత్‌రెడ్డి అని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ విమర్శించారు. పైగా కేటీఆర్‌పై కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. ఆదివారం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ-కార్ రేస్ వల్ల ప్రపంచంలో హైదరాబాద్ పేరు మార్మోగిందని, పలు కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టినట్టు తెలిపారు. రాష్ట్రంలో వసూళ్ల కథనే నడుస్తున్నదని, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను అందరూ కమీషన్ల నారాయణ అని పిలుస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎల్ఎండీ, ఎంఎండీలో నీళ్లు ఉండగానే ఇసుక తోడేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కాంట్రాక్టులు పొందారని విమర్శించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అన్ని స్థానాలు కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, ఉల్లెంగుల ఏకానందం తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమంలో ఎన్నారైల పాత్ర కీలకం

- నాలుగేండ్ల తర్వాత వచ్చేది మన ప్రభుత్వమే
- అప్పటి దాకా నిర్మాణాత్మక ప్రతిపక్షపాత్ర పోషించాలి
- ఎన్‌ఆర్‌ఐ బీఆర్‌ఎస్ యూకే జూమ్ మీటింగ్‌లో వినోద్‌కుమార్

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఉద్యమంలో ఎన్నారైలు కీలకపాత్ర పోషించారని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ కొనియాడారు. బీఆర్‌ఎస్ స్థాపించిన 2001 నుంచి వారు వెన్నెముకగా నిలబడ్డారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ఎన్నారై యూకే అధ్యక్షుడు నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జూమ్ ద్వారా నిర్వహించిన యూకే కార్యవర్గ సమావేశంలో వ్యవస్థాపక అధ్యక్షుడు కూర్మాచలం అనిల్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలేని తెలంగాణను ప్రజలు ఊహించుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో ముందు నిలిచి జాతీయ, అంతర్జాతీయ అవార్డులు గెలుచుకున్నదని గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేండ్ల తర్వాత వచ్చేది మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమేనని, అప్పటి వరకు ఎన్నారైలు ప్రజాసమస్యలపై నిత్యం గళమెత్తాలని సూచించారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో అక్రమ అరెస్టులు, నిర్బంధాలు తప్పా ఒరిగిందేమీలేదని కూర్మాచలం అనిల్ తెలిపారు. సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపాలని ఎన్నారైలను కోరారు. నవీన్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్, కేటీఆర్ ఇచ్చే ప్రతిపిలుపునకు స్పందించి ప్రభుత్వ వైఖరిని ఎండగడతామని పేర్కొన్నారు. సమావేశంలో ఎన్నారై బీఆర్‌ఎస్ సెల్ వ్యవస్థాపక ఉపాధ్యక్షుడు హరిగౌడ్, సతీశ్‌రెడ్డి గొట్టిముక్కుల, సత్యమూర్తి చిలుముల, జనరల్ సెక్రటరీ రత్నాకర్ కడుదుల తదితరులు పాల్గొన్నారు.

# కళతప్పిన కాళోజీ కళా క్షేత్రం

- రెండు నెలల క్రితం ప్రారంభించిన సీఎం రేవంత్
- ఆ ఒక్కరోజు తప్ప ఏనాడూ తెరుచుకోని తలుపులు
- ఒక్క కార్యక్రమమూ నిర్వహించని పరిస్థితి
- రాష్ట్రంలోనే అతిపెద్ద కళాకేంద్రం మూత
- కవులు, కళాకారుల తీవ్ర అసంతృప్తి
- 85.10 కోట్లతో కేసీఆర్ సర్కారు నిర్మాణం



వరంగల్‌లోని కాళోజీ కళా క్షేత్రం

వరంగల్, జనవరి 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : చారిత్రక వరంగల్ నగరాన్ని సాంస్కృతిక, సాహిత్య, నాటక రంగాల కార్యక్రమాలకు కేంద్రంగా నిలిపేందుకు ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళోజీ కళాక్షేత్రం పడావుగా ఉంటున్నది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నవంబర్ 19న ఈ కళాక్షేత్రాన్ని ప్రారంభించారు. ఆ రోజు ప్రారంభోత్సవం కోసం తీసిన తలుపులను కార్యక్రమం ముగియగానే మూసివేశారు. రెండు నెలలవుతున్నా ఇప్పటికీ మళ్లీ తెరువలేదు. కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఆధ్వర్యంలో కళాక్షేత్రం నిర్మాణం పూర్తయ్యింది. కుడా పరిధిలోనే ఈ కళాక్షేత్రం నిర్వహణ ఉన్నది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభోత్సవం చేసినప్పటి నుంచి ఈ కళాక్షేత్రంలో ఇప్పటివరకు ఒక్క కార్యక్రమం కూడా జరగలేదు. వరంగల్‌తో పాటు ఇతర ప్రాంతాల్లోని వారు ఇక్కడ సాహిత్య, సాంస్కృతిక, నాటక కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు ఆసక్తి చూపుతారు. కార్యక్రమాల కోసం దీన్ని కేటాయించాలని కుడా అధికారులను కోరుతున్నా, వారెవరూ పట్టించుకోవడంలేదు. ఇందులో ఏ కార్యక్రమాలను నిర్వహించాలనేది ఇప్పటివరకు స్పష్టతలేదు. రోజు వారీగా ఎంత మొత్తం చెల్లించాలనేది ఖరారు కాలేదు. కారణాలు ఏమైనా కళాక్షేత్రం నిర్మించిన స్ఫూర్తి నెరవేరకపోవడంపై వరంగల్‌లోని కవులు, కళాకారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. వరంగల్ నగరానికి ఉన్న ప్రతిష్ఠను పెంచేందుకు కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన కళాక్షేత్రాన్ని కనీసం వినియోగంలోకి తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలోనే అతి పెద్ద కళాక్షేత్రం ఇలా పడావుగా ఉండటం సరికాదని పలువురు పేర్కొంటున్నారు. మరో వారం వరకు వేచి చూసి నిరసన తెలియజేస్తామని హెచ్చరిస్తున్నారు.

### కాళోజీ శతజయంతి వేడుకల సందర్భంగా..

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తపించి, పోరాడిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు శతజయంతి ఉత్సవాలు 2014 సెప్టెంబర్ 9న మొదలయ్యాయి. కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అదే రోజు కాళోజీ కళాక్షేత్రం భవన నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. కేసీఆర్ ప్రభుత్వం 4.25 ఎకరాల్లో విభిన్న శైలిలో కాళోజీ కళాక్షేత్రం భవనాన్ని నిర్మించింది. 1.39 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో నాలుగు అంతస్తులతో భవనాన్ని నిర్మించారు. 1,500 సీటింగ్ సామర్థ్యంతో ఆడిటోరియం, మరో మీటింగ్ హాల్, డైనింగ్ హాల్స్, వీఐపీ సూట్స్‌ను అత్యాధునిక టెక్నాలజీతో నిర్మాణం చేపట్టారు. కార్యక్రమాల నిర్వహణకు అనుగుణంగా గ్రౌండ్ ఫ్లోర్‌లో రెండు మేకప్ గదులు ఉన్నాయి. ఆర్ట్ గ్యాలరీ, దీన్ని కూర్చుని చూడటానికి వీలుగా ప్రీ ఫంక్షన్ లాబీని ఏర్పాటు చేశారు. సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాలుగు హైకెపాసిటీ లిఫ్టులను బిగించారు. రూ.85.10 కోట్లతో భవన నిర్మాణం పూర్తయ్యింది. భవనం నిర్మాణం పూర్తయిన తర్వాత 2023 అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ప్రారంభోత్సవం వాయిదా పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 11 నెలల తర్వాత... నవంబర్ 19న సీఎం రేవంత్‌రెడ్డి కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభించగా ఆ ఒక్క రోజు తప్ప ఎప్పుడూ తెరుచుకోలేదు.

## ఆర్టీసీ సంక్రాంతి ఆదాయం 112.46 కోట్లు

- నిరుటితో పోలిస్తే రూ.14 కోట్లు అదనం
- ప్రత్యేక బస్సులతో రూ.98.14 కోట్లు

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): టీఎస్ ఆర్టీసీకి సంక్రాంతి కలిసొచ్చింది. పండుగ వేళ నడిపిన బస్సులతో దండిగా ఆదాయం సమకూరింది. ప్రత్యేక బస్సులను నడిపించడంతో టీజీఎస్ ఆర్టీసీకి రూ.112.46 కోట్లు వచ్చాయి. నిరుడు సంక్రాంతికి 4,962 ప్రత్యేక బస్సులను నడిపిస్తే రూ.98.49 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది 5,806 ప్రత్యేక బస్సులను నడిపించగా రూ.112.46 కోట్లు సాధించింది. నిరుటితో పోలిస్తే రూ.14 కోట్లు అదనంగా వచ్చినట్టు ఆర్టీసీ అధికారులు లెక్కలు వేస్తున్నారు. సుమారు ఆరు లక్షల ప్రయాణికులు సంక్రాంతి పండుగ సందర్భంగా సొంతూళ్లకు వెళ్లినట్టు వెల్లడించారు. సొంతూళ్ల నుంచి తిరిగి వచ్చే ప్రయాణికుల కోసం ఈ నెల 19, 20 తేదీల్లో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. కాగా, 17,18వ తేదీల్లో బస్సులు నడిపించినప్పటికీ అనుకున్నంత మంది ప్రయాణించలేదని అధికారులు భావిస్తున్నారు. కాగా, ఏపీ నుంచి తెలంగాణకు టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినా, ఏపీఎస్ ఆర్టీసీలో సాధారణ చార్జీలే ఉండటంతో అక్కడి ప్రజలు ఎక్కువగా వాటిలోనే ప్రయాణించినట్టు తెలిసింది.


## సంక్రాంతి వేళ హైవేపై ఆర్టీఏ తనిఖీలు

- 317 కాంట్రాక్టు క్యారేజ్ బస్సులపై కేసులు

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ) : సంక్రాంతి వేళ ఆర్టీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు హైవేపై తనిఖీలు చేపట్టి భారీ సంఖ్యలో కేసులు నమోదుచేశారు. ఒక్క హైదరాబాద్ పరిధిలోనే వారం రోజులుగా కాంట్రాక్టు క్యారేజ్ బస్సులపై 317 కేసులు నమోదు చేసినట్టు ట్రాన్స్‌పోర్ట్ జాయింట్ కమిషనర్ రమేశ్‌కుమార్ వెల్లడించారు. సెంట్రల్‌జోన్ పరిధిలో ట్యాక్స్‌లు చెల్లించని, నిబంధనలకు విరుద్ధంగా నడిపిన 43 బస్సులు, ఈస్ట్‌జోన్‌లో 50, వెస్ట్‌జోన్‌లో 30, నార్త్‌జోన్‌లో 48, సౌత్‌జోన్‌లో 72 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై కేసులు నమోదుచేసినట్టు వివరించారు. నాగోల్ డ్రైవింగ్ టెస్ట్‌ట్రాక్ పరిధిలో వాణిజ్య ఉత్పత్తుల రవాణా, ఫైర్‌సేఫ్టీ లేని, డ్రైవర్లకు యూనిఫాం లేని బస్సులకు సంబంధించి 74 కేసులు నమోదుచేసినట్టు తెలిపారు. వీరి నుంచి రూ.1,11,000 పెనాల్టీ వసూలు చేసినట్టు చెప్పారు. మేడ్చల్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల పరిధిలో 415 ప్రైవేట్ బస్సులపై కేసులు నమోదు చేసినట్టు రవాణాశాఖ అధికారులు తెలిపారు.

## హిట్ అండ్ రన్‌లో మరణిస్తే 2 లక్షలు

- గాయపడితే రూ.50వేల పరిహారం
- పథకంపై కొరవడిన ప్రభుత్వ అధికారుల ప్రచారం
- రోడ్డు ప్రమాద బాధితులకు అందని ఆర్థిక భరోసా
- కేంద్ర ప్రభుత్వ చట్టంలో పేర్కొన్న కీలకాంశాలు



హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): రోడ్డు ప్రమాదంలో గాయపడినా, మరణించినా బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘హిట్ అండ్ రన్’ పథకంపై జనంలో అవగాహన కొరవడింది. 2022లో అమల్లోకి వచ్చిన ఈ పథకం గురించి బాధితులకు తెలియకపోవడం వల్ల సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. రోడ్డుపై వెళ్తున్న వ్యక్తిని ఏదైనా గుర్తుతెలియని వాహనాలు ఢీకొట్టి వెళ్లిపోతే, ప్రమాదంలో గాయపడ్డా, చనిపోయినా ‘హిట్ అండ్ రన్’ చట్టం కింద కేసు నమోదవుతుంది. గాయపడితే ఆ వ్యక్తికి రూ.50వేలు, మరణిస్తే ఆ వ్యక్తి కుటుంబానికి రూ.2 లక్షలు కేంద్రం ఆర్థిక సాయం అందిస్తుంది.

### సాయం ఎలా పొందాలి?

‘హిట్ అండ్ రన్’ పరిహారం పొందాలంటే 2 రకాల దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. బాధితులు ఫారం(1) ద్వారా ప్రమాదం ఎప్పుడు, ఎక్కడ, ఎలా జరిగింది? ఏ విధమైన గాయాలయ్యాయి? చికిత్స వివరాలతో దరఖాస్తు ఫారం నింపాలి. ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు జతచేయాలి. ప్రమాదంలో బాధితులు చనిపోతే మృతుల కుటుంబ సభ్యులు తమ బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీ జత చేయాలి. దవాఖానలో సొంత నగదుతో చికిత్స పొంది, ఆ తర్వాత రీఫండ్ పొందేందుకు ఫారం(4) ద్వారా దరఖాస్తు తీసుకోవాలి. చికిత్స పొందిన దవాఖాన, ఖర్చు రసీదులు, ఎఫ్ఐఆర్ కాపీ, మృతి చెందితే పోస్టుమార్టం రిపోర్ట్, డెత్ సర్టిఫికెట్ జత చేసి రెవెన్యూ, పోలీసు అధికారులకు సమర్పించాలి. అధికారులు విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక పంపిస్తారు. అధికారులు తుదివిచారణ జరిపి 15 రోజుల్లో బాధితుల ఖాతాలో నగదును జమ చేస్తారు.

### అవగాహన లేక.. సాయం అందక

‘హిట్ అండ్ రన్ ’ స్కీమ్ అమలు పోలీస్, రెవెన్యూ అధికారులపై ఆధారపడి ఉంటుంది. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోతే, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేస్తారు. ప్రమాదానికి గురైన వ్యక్తి మరణిస్తే ఆర్డీవోకు ఎఫ్ఐఆర్ కాపీ, పూర్తి సమాచారంతో రిపోర్టు అందించాలి. ఆర్డీవో విచారణ చేసి ప్రమాదంలో గాయపడిన లేదా మృతి చెందిన వ్యక్తుల వివరాలను పరిశీలించి, నివేదికను కలెక్టర్‌కు సమర్పించాలి. ఆ నివేదికను కలెక్టర్ పరిశీలించి, బాధితులు చనిపోతే రూ.2లక్షలు, గాయాలపాలైతే రూ.50వేలు సాయం అందజేయాలి. కానీ పథకం ప్రారంభించి మూడేండ్లు కావొస్తున్నా ప్రజలకు అవగాహన కల్పించడంలో పోలీసు, రెవెన్యూ అధికారులు చొరవ చూపడం లేదని పలు ప్రమాద కేసుల్లో స్పష్టమవుతున్నది. చాలామంది అధికారులకు కూడా పథకం గురించి తెలియకపోవడంతో బాధితులకు సాయం అందడంలేదు.

## ఫ్లాట్ల అమ్మకం పేరుతో భారీ మోసం

- డబ్బు దండుకుని రిజిస్ట్రేషన్ చేయని యూఆర్‌పీఎల్
- బాధితుల ఫిర్యాదుతో 9 మంది డైరెక్టర్లపై కేసు నమోదు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 19 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో యూనివర్సల్ రియల్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (యూఆర్‌పీఎల్) సంస్థ భారీ మోసానికి తెగబడింది. రెసిడెన్షియల్ ఫ్లాట్లు విక్రయిస్తాంటూ దాదాపు 300 మంది నుంచి రూ.225 కోట్లు దండుకుని నమ్మక ద్రోహనికి పాల్పడింది. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం కేసు నమోదు చేసింది. యూఆర్‌పీఎల్‌తోపాటు ఆ సంస్థ డైరెక్టర్లు వినోద్ షానే, మహబిర్ అగర్వాల్, యశ్వంత్ అగర్వాల్, పవన్‌కుమార్ అగర్వాల్, అరుణ్‌కుమార్ సురేఖ, సీనియర్ మేనేజ్‌మెంట్ సభ్యులు చౌజర్ల గోపాల్‌రెడ్డి, కుమార్ మదస, యశ్వంత్, బాలకాంత్ తదితరులను నిందితులుగా చేర్చి దర్యాప్తు చేపట్టింది. యూఆర్‌పీఎల్ నుంచి రెసిడెన్షియనల్ ఫ్లాట్స్ కొనుగోలు చేశామని, దాదాపు పదేండ్ల క్రితమే డబ్బు చెల్లించినప్పటికీ ఆ సంస్థ నిర్వాహకులు ఇంకా రిజిస్ట్రేషన్లు చేయకుండా తమను క్షోభ పెడుతున్నారని, తాము చెల్లించిన డబ్బంతా దుర్వినియోగం చేసి మోసానికి పాల్పడ్డారని బాధితులు వాపోయారు. రిజిస్ట్రేషన్లు లేకపోవడంతో టాప్ అప్ లోన్లు తీసుకోలేకపోతున్నామని, ఆ ఫ్లాట్లను ఇతరులకు విక్రయించలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై యూఆర్‌పీఎల్ డైరెక్టర్లకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోయిందని తెలిపారు.

MSME-TOOL ROOM, HYDERABAD
(CENTRAL INSTITUTE OF TOOL DESIGN)
(A Government of India Society Ministry of MSME)
Balanagar 'X' Roads, Hyderabad - 500 037 (TS) INDIA
VACANCY NOTIFICATION
"Positions for CNC Maintenance Mechanical Engineer, CNC Maintenance Electrical Engineer, Operators: CNC Lathe; CNC Cylindrical Grinding; CNC EDM / Wire-Cut, CNC Milling; CNC Sads; NC Surface Grinding; Tool makers; Tool Fitters, PPC / Production Engineer".
Date of Interview : 25th January 2025
Candidates fulfilling the eligibility criteria may step-in for interview on the date mentioned with latest Resume with photo, original documents & one set self-attested photocopies of all educational, experience certificates
For detailed advertisement visit citdindia.org
Sd/-
PRINCIPAL DIRECTOR